# నీలగిరి ఎక్స్‌ప్రెస్


తెలుగు దిన పత్రిక

## విలేకరులు కావలెను

తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు
- RC ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు

-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.

సంచిక : 16 | సంపుటి : 3 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | బుధవారం | 16-4 -2025 | వెల : .రూ. 5.00



## ఢిల్లీ కాలుష్యానికి చెక్ పెట్టాల్సిందే

- ప్రత్యామ్నాయ ఇంధన వనరులు వాడాలి
- కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
దేశ రాజధానిలో వాతావరణ కాలుష్యం తీవ్రస్థాయిలో ఉండటంపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆందోళన వ్యక్తంచేశారు. ముఖ్యంగా శిలాజ ఇంధనాలు తగ్గించాలని, ఎలక్ట్రిక్ వాహనాల వైపు ప్రజలు మళ్లాలలని ఆయన సూచించారు. మంగళవారం నాడు ఆయన మాట్లాడుతూ...ఢిల్లీ కాలుష్యానికి చెక్ పెట్టేందుకు ప్రజలు కూడా బాధ్యతగా ముందుకు రావాలన్నారు.

-మిగతా 2 లో

# పార్టీ గీత దాటితే ఊరుకునేది లేదు

## హైదరాబాద్ వీడి గ్రామాలకు తరలి వెళ్లాల్సిందే

- మంత్రివర్గ విస్తరణ అధిష్టానం పరిధిలో ఉంది
- సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి
- సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండండి
- విపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి
- పార్టీ ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ సూచన



**హైదరాబాద్, ఏప్రిల్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణ నేపథ్యంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చేస్తున్న వ్యాఖ్యలు దుమారం రేపుతున్న వేళ...ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ రెడ్డి సున్నితంగా హెచ్చరిక చేశారు. ఎవ్వరు కూడా పాటీ లైన్ దాటి మాట్లాడవద్దని అన్నారు. మంత్రివర్గ విస్తరణ అన్నది అదిష్టానం నిర్ణయమని

-మిగతా 2 లో



## రాష్ట్రంలో ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నాం

- అనేక కార్యక్రమాలు అమలుచేసి చూపాం
- సీఎల్‌పి సమావేశంలో మల్లు భట్టి విక్రమార్క

**హైదరాబాద్, ఏప్రిల్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఎంతో నిబద్ధతతో పనిచేస్తోందని, లబ్ధిదారులు ఈ పథకాలను హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఉద్ఘాటించారు. తెలంగాణ కాంగ్రెస్ లెజిస్లేటివ్ పార్టీ (సీఎల్పీ) సమావేశంలో మల్లు భట్టి విక్రమార్క మాట్లాడారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, సామాజిక న్యాయం కోసం

-మిగతా 2 లో



## ప్రభుత్వాన్ని కూలుస్తామంటే ఊరుకోం

### పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ హెచ్చరిక

**హైదరాబాద్, ఏప్రిల్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చుతామంటే చూస్తూ ఊరుకోం అని.. ఇక్కడ ఎవరూ చేతులు కట్టుకుని కూర్చోలేదంటూ కాంగ్రెస్ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు హెచ్చరించారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంత అవినీతి చేసిందో.. ఎంత దోచుకుందో.. కాంట్రాక్టర్ల పేరుతో తెలంగాణ జనం సొమ్మును

-మిగతా 2 లో



## ట్రంప్ దూకుడుకు చైనా కళ్లెం

- కీలక ఖనిజాల ఎగుమతులు నిలిపివేత
- టెక్నాలజీ, ఎలక్ట్రానిక్ పరికరాల ముడిసరుకుల పై దెబ్బ

**వాషింగ్టన్, ఏప్రిల్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
అమెరికా- చైనాల మధ్య సుంకాల యుద్ధం కొనసాగుతోంది. ఈ క్రమంలో చైనా కూడా ట్రంప్ తీరుకు ఘాటుగా సమాధానం ఇస్తోంది. ఈక్రమంలో అమెరికాకు అవసరమైన పలు వస్తువులపై నిషేధం విధించి, ఎగుమతలను నిలిపివేసింది. చైనా ఉత్పత్తులపై టారిఫ్‌లను యూఎస్ 145 శాతానికి పెంచినట్లు ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. అందుకు ప్రతిగా చైనా కూడా

-మిగతా 2 లో

# పింక్ బుక్‌లో బెదిరింపు నేతల పేర్లు



- ఎట్టి పరిస్థితుల్లోనూ వారిని వదిలిపెట్టం
- రజతోత్సవ సభకు రాకుండా బెదిరింపులు
- వేధించే నాయకులు, అధికారులను వదలబోం
- సన్నాహక సమావేశంలో ఎమ్మెల్సీ కవిత ఘాటు వ్యాఖ్యలు

**కామారెడ్డి,ఏప్రిల్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఎవరెవరు బెదిరిస్తున్నారో వాళ్ల పేర్లను బరాబర్ పింక్ బుక్కులో రాసుకుంటాం.. బెదిరింపులకు పాల్పడేవారిని ఎట్టిపరిస్థితుల్లో వదిలిపెట్టేదే లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలను వేధిస్తున్న కాంగ్రెస్ నాయకులపై ఎమ్మెల్సీ కవిత ఫైర్ అయ్యారు. బాన్సువాడలో బీఆర్ఎస్ రజతోత్సవ సన్నాహక సమావేశంలో కవిత పాల్గొని ప్రసంగించారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వెళ్లవద్దని కొంత మంది ఫోన్లు చేసి బెదిరిస్తున్నట్లు- తెలిసింది. కేసులు పెట్టించే పోలీస్ స్టేషన్లకు ఈడ్చిన వాళ్లను క్షమించే

-మిగతా 2 లో



## నేటి నుంచి జపాన్ పర్యటనకు సీఎం రేవంత్

### ఏప్రిల్ 16 నుంచి 22 వరకు

**హైదరాబాద్, ఏప్రిల్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం జపాన్ పర్యటన కు బయల్దేర నున్నారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, రాష్ట్ర అధికారుల ప్రతినిధి బృందం సీఎం వెంట వెళ్లనున్నారు. ఏప్రిల్ 16 నుంచి 22 వరకు తెలంగాణ ప్రతినిధుల బృందం

-మిగతా 2 లో

## నవజాత శిశువు మిస్సింగ్ అయితే హాస్పిటల్ లైసెన్స్ ను రద్దు చేయాలి

### -సుప్రీంకోర్టు ఆదేశం



**న్యూఢిల్లీ,ఏప్రిల్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
శిశువుల అక్రమ రవాణా కేసుల విషయంలో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. ఏ ఆస్పత్రిలోనైనా శిశువుల అక్రమ రవాణా జరిగినట్లు తేలితే లైసెన్స్ రద్దు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. అంతేగాక శిశువుల అక్రమ రవాణాను నిరోధించేందుకు ప్రభుత్వానికి

-మిగతా 2 లో

## ట్రిలియన్ డాలర్ల ఎకానమీ దిశగా తెలంగాణ



- ప్రభుత్వ ప్రైవేటు- భాగస్వామ్యంతో ఆర్థిక వ్యవస్థ పురోగతి
- ఇతర నగరాలకన్నా హైదరాబాద్‌లో 56శాతం వృద్దిరేటు
- సిటిజన్‌గ్లోబల్ కేపబిలిటీసెంటర్ ప్రారంభోత్సవంలో శ్రీధర్ బాబు

**హైదరాబాద్,ఏప్రిల్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
గ్లోబల్ బిజినెస్ హబ్‌గా హైదరాబాద్ మారిందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఇక్కడ కమర్షియల్ స్పేస్‌కు డిమాండ్ బాగా

-మిగతా 2 లో

## ప్రభుత్వాన్ని కూల్చే కుట్రలో బీఆర్ఎస్ నేతలు



- కేసీఆర్ ఆదేశాలతోనే కొత్త పలుకులు
- ప్రభుత్వం చేసే మంచి పనులు జీర్ణించుకోలేని గులాబీ నేతలు
- ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యలపై పొంగులేటి ఆగ్రహం

**హైదరాబాద్, ఏప్రిల్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కాంగ్రెస్ పార్టీకి, ఇందిరమ్మ ప్రభుత్వానికి ప్రజలు మద్దతిచ్చారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వాన్ని పడగొట్టాలని పలువురు

-మిగతా 2 లో

# పార్టీ గీత దాటితే ఊరుకునేది లేదు

(మొదటి తరువాయి)

కూడా స్పష్టం చేశారు. శంషాబాద్ నోవాటెల్ హోటల్‌లో జరిగిన కాంగ్రెస్ శాసనభాపక్ష సమావేశంలో సిఎం రేవంత్ మాట్లాడారు. తనకు మంత్రి పదవి రాకుండా జానా రెడ్డి అడ్డుకుంటున్నారని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రచ్చ చేస్తే.. పదేళ్లు పార్టీని కాపాడుకున్న మమ్మల్ని కాదని.. వేరే పార్టీలు తిరిగొచ్చిన వారికి పదవులు ఇస్తారా అని ప్రేమ్‌సాగర్ రావు పరోక్షంగా ప్రభుత్వానికే వార్నింగ్ ఇచ్చారు. ఇలా ఒక్కొక్కరుగా కాంగ్రెస్ ఎమ్మెల్యే బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేస్తుండటంపై సీఎం రేవంత్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు హెచ్చరికలు చేశారు. మంత్రి పదవులను అధిష్ఠానం చూసుకుంటుందని తెలిపారు. పార్టీ గీత దాటితే ఊరుకునేది లేదని ఎమ్మెల్యేలను హెచ్చరించారు. పార్టీకి ఇబ్బంది కలిగిస్తే నేతలే ఇబ్బందులు ఎదుర్కొంటారని అన్నారు. పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడితే లాభం కంటే నష్టమే ఎక్కువ అని చెప్పారు. మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానందే తుది నిర్ణయమని స్పష్టం చేశారు. మంత్రివర్గ విస్తరణపై ఎవరేం మాట్లాడినా ఉపయోగం లేదని అన్నారు. మీరు మాట్లాడేదంతా రికార్డవుతుందని హెచ్చరించారు అలాగే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎవరూ సోషల్‌మీడియా వాడటం లేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వంపై నెగిటివ్ ప్రచారం చేస్తుంటే.. ఎమ్మెల్యేలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పలువురు ఎమ్మెల్యేలు హైదరాబాద్‌కే పరిమితమవుతున్నారని అన్నారు. వీకెండ్ రాజకీయాలు చేయొద్దని సూచించారు. రేవంత్‌రెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ శాసనసభా పక్షం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం.. పలువురు ఎమ్మెల్యేలను హెచ్చరించినట్లు తెలుస్తోంది. పార్టీకి ఇబ్బంది కలిగిస్తే నేతలే ఇబ్బందులు ఎదుర్కొంటారు. పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడితే లాభం కంటే నష్టమే ఎక్కువ. మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్. దీనిపై ఎవరేం మాట్లాడినా ఉపయోగం లేదని సీఎం తేల్చి చెప్పారు. మంత్రి పదవులపై ఒకరికి మించి మరొకరు లీకులు ఇస్తున్నారని అసహనం వ్యక్తం చేసిన సీఎం.. ఇష్టం వచ్చినట్లు- మాట్లాడితే మంత్రి పదవులు రావన్నారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు జాగ్రత్తగా పని చేసుకోవాలని సూచించారు. కాగా, మంత్రి వర్గ విస్తరణపై కొందరు ఆశావహులు బహిరంగంగానే తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. తనకు మంత్రి పదవి ఇవ్వకుంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఏకంగా హుకుం జారీ చేశారు. మరోవైపు.. మంత్రి పదవి విషయంలో మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఇలా మంత్రి వర్గ విస్తరణపై ఆశవహులు బహిరంగంగ మాట్లాతుండటంతోనే తాజాగా జరిగిన సీఎల్పీ భేటీలో సీఎం రేవంత్ రెడ్డి వార్నింగ్ ఇచ్చినట్లు తెలిసింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ నేతలకు దిశా నిర్దేశర చేశారు. ఎమ్మెల్యేలు ప్రతి గ్రామంలో పర్యటించేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. రేపటి నుంచి జూన్ 2 వరకు ఎమ్మెల్యేలు గ్రామాల్లో పర్యటించాలి. నేను కూడా మే 1 నుంచి జూన్ 2 వరకు ప్రజలతో మమేకమవుతా. ప్రతిపక్షాల ప్రచారాన్ని నమ్మి.. బుల్డోజర్లు పంపిస్తున్నారని ప్రధాని మాట్లాడుతున్నారు. భాజపా, భారాస కలిసి ప్రజా ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నాయి. పార్టీ, ప్రభుత్వ ప్రతిష్ఠ పెరిగితేనే భవిష్యత్ ఉంటుంది. మళ్లీ గెలవాలంటే ఇప్పటి నుంచే ప్రజల్లోకి వెళ్లాలి. తెలంగాణ పథకాలతో ప్రధాని మోదీ ఉక్కిరిబిక్కిరవుతున్నారు. తెలంగాణ మోడల్‌పై దేశంలో చర్చ జరుగుతోంది. కాంగ్రెస్‌ను ఇబ్బంది పెట్టాలనే భాజపా, భారాస ఒక్కటయ్యాయి. సన్నబియ్యం మన పథకం.. మన పేటెంట్, మన బ్రాండ్. భాజపా పాలిత రాష్ట్రాల్లో సన్నబియ్యం ఎందుకు ఇవ్వట్లేదో చెప్పాలని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ సమావేశంలో మంత్రులు భట్టి విక్రమార్క,పొంగులేటి, శ్రీధర్ బాబు, పొన్నం, పిసిస చీఫ్ మహేశ్కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రంప్ దూకుడుకు చైనా కళ్లెం

(మొదటి తరువాయి)

అమెరికా ఉత్పత్తులపై సుంకాలను 125 శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించింది. అంతటితో ఆగకుండా తమ దేశంలో లభ్యమయ్యే అరుదైన ఖనిజాలు, కీలకమైన లోహాలు, అయస్కాంతాలను యూఎస్‌కు ఎగుమతి చేయడాన్ని ఆపేస్తున్నట్లు బీజింగ్ పేర్కొంది. ఈ ప్రకటనపై అమెరికా స్పందించింది. ఖనిజాల ఎగుమతి విషయంలో చైనా తీసుకున్న నిర్ణయం ఆందోళనకరంగా ఉందని ట్రంప్ ముఖ్య ఆర్థిక సలహాదారుల్లో ఒకరైన కెవిన్ హసెట్ పేర్కొన్నారు. టెక్నాలజీ, ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ రంగంలో ఈ ఖనిజాల అవసరం ఎక్కువగా ఉందన్నారు. డ్రాగన్ నిర్ణయం వల్ల పశ్చిమదేశాల్లో ఆయుధాలు, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, ఏరోస్పేస్ తయారీ, సెమీకండక్టర్ల కంపెనీలకు సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. ఈ అంశాన్ని నిశితంగా పరిశీలిస్తున్నామని.. వీటిపై డ్రాగన్‌తో చర్చలు జరిపే అవకాశం ఉందని తెలిపారు. అయితే ట్రంప్ విధించిన టారిఫ్‌ల వల్ల 100 శాతం మాంద్యం వస్తుందని తామేమీ అనుకోవట్లేదని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న అరుదైన ఖనిజాల్లో దాదాపు 90శాతం చైనా నుంచే వెళుతున్నాయి. తాజాగా బీజింగ్ చేపట్టిన చర్యల ప్రభావం కేవలం అమెరికా వరకే పరిమితం కాదు.. అన్ని దేశాలపైనా ఉండనుంది. తొలుత చైనా ఉత్పత్తులపై టారిఫ్‌లను ట్రంప్ 54శాతం పెంచడంతో కీలక విడిభాగాల ఎగుమతులను చైనా ఆపేసింది. మరోసారి అగ్రరాజ్యం సుంకాలను 145 శాతానికి పెంచడంతో అరుదైన ఖనిజాలు, కీలకమైన లోహాలు, అయస్కాంతాలు, ఇతర ఉత్పత్తులను ఎగుమతి చేయడం బీజింగ్ నిలిపివేసింది. దీంతోపాటు- ఎక్స్‌పోర్ట్ లైసెన్స్‌లను పరిమితం చేసే అవకాశాలు కూడా ఉన్నాయి. అమెరికాలోని లాక్‌హీడ్‌మార్టిన్, -టె-స్లా, యాపిల్ వంటి సంస్థలు చాలా ముడిపదార్థాల కోసం బీజింగ్‌పైనే ఆధారపడుతున్నాయి. అమెరికా ప్రభుత్వం వద్ద రేర్‌ఎర్త్ మినరల్స్ నిల్వలు ఇప్పటికే ఉన్నాయి. కానీ, తమ డిఫెన్స్ కాంట్రాక్టర్లకు సరఫరా చేయడానికి మాత్రం ఇవి సరిపోవు. దీంతో అమెరికా ప్రభుత్వం చైనా చర్యలపై ఆందోళన వ్యక్తంచేస్తోంది.

# పింక్ బుక్‌లో బెదిరింపు నేతల పేర్లు

(మొదటి తరువాయి)

ప్రసక్తే లేదు. బీఆర్ఎస్ కార్యకర్తలను వేధించే కాంగ్రెస్ నాయకులు, అధికారులు ఎవరైనా ఊరుకునేదే లేదు. కాంగ్రెస్ నాయకుల తాటాకు చప్పుళ్లకు భయపడేదే లేదు. వాళ్ల తాతలు, ముత్తాతలు, జేజమ్మలు ఎవరు దిగొచ్చినా కూడా భయపడేవాళ్లెవరూ లేరు ఇక్కడ అని ఎమ్మెల్సీ కవిత తేల్చిచెప్పారు. మాట తప్పడం... మడమ తిప్పడమే కాంగ్రెస్ నైజం. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సంతకాలు పెట్టిన గ్యారెంటీ కార్డులను కాంగ్రెస్ నాయకులు ఇంటింటికి పంచి ఓట్లేయించుకున్నారు. ఇప్పుడు గ్యారెంటీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్నది. గతంలో తెలంగాణ ఇస్తామని హామీ ఇచ్చి పదేళ్ల పాటు- అరిగోస పెట్టింది కాంగ్రెస్ పార్టీ. వందలాది మంది తెలంగాణ బిడ్డల ఆత్మబలిదానాలకు కారణం కాంగ్రెస్ పార్టీ. ఏడాదిన్నర పాలనలోనే ఇంత వ్యతిరేకత మూటగట్టు-కున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి నోబుల్ ప్రైజ్ ఇవ్వాలని కవిత విమర్శించారు. ప్రతీ ఇంటి నుంచి ఒకరు రజతోత్సవ సభకు రావాలి. తెలంగాణ గడ్డ మీద అగ్గిపెట్టించి రాష్ట్రాన్ని సాధించిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీది. నలిగిపోయిన ఆత్మగౌరవాన్ని రెపరెపలాడించింది బీఆర్ఎస్ పార్టీ. స్వతంత్ర దేశంలో లక్ష్యాన్ని చేరిన ఏకైక పోరాటం కేసీఆర్ నేతృత్వంలోని తెలంగాణ ఉద్యమం మాత్రం. వీరులు మాత్రమే లక్ష్యం చేరే వరకు పోరాటం చేస్తారు... అది కేసీఆర్‌తో మాత్రమే సాధ్యమైంది. ప్రజాస్వామ్య పంథాను నమ్ముకొని హింసాయుతంగా పోరాటం చేసి తెలంగాణ సాధించాము. త్యాగాలతో తెలంగాణ కోసం కేసీఆర్ మొదటి అడుగు వేశారు. కేంద్ర మంత్రి పదవిని సైతం గడ్డిపోచలా వదిలేసిన ఘనత కేసీఆర్‌ది. ఎవరో భిక్షపెడితేనో, ఎవరో దయదలచి ఇస్తే తెలంగాణ రాలేదు. కేసీఆర్ త్యాగం, కృషి, పోరాటపటిమ వల్ల తెలంగాణ సాధ్యమైంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే తెలంగాణలో కటిక చీకటి వస్తుంది, నక్సలైట్ల రాజ్యం వస్తుందని అప్పటి సీఎం కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. కానీ తెలంగాణ వచ్చిన తర్వాత వెలుగు జిలుగుల తెలంగాణను తయారు చేసుకున్నాం. కోటి ఎకరాల మాగాణను తయారు చేసుకున్నాం.

## ట్రిలియన్ డాలర్ల ఎకానమీ దిశగా తెలంగాణ

(మొదటి తరువాయి)

పెరిగిందని చెప్పారు. అమెరికాకు చెందిన సిటిజన్స్ ఫైనాన్షియల్ గ్రూప్, కాగ్నిజెంట్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో సిటిజన్స్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సెంటర్‌ను మంత్రి ప్రారంభించిన సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడారు. ఢిల్లీ, చెన్నైలాంటి మెట్రో నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లో 56 శాతం వృద్ధి రేటు ఉంది. ఈ క్రమంలో తెలంగాణ దేశంలో 1 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ఎదిగేందుకు చేస్తున్న ప్రయత్నానికి దోహదపడుతుందని మంత్రి అన్నారు. ప్రస్తుతం బలమైన ప్రభుత్వ ప్రైవేటు- భాగస్వామ్యంతో తెలంగాణ ఆర్థిక వ్యవస్థ వేగంగా ముందుకు సాగుతోందని ఆయన వెల్లడించారు. గతేడాది రిటైల్ రంగంలో 1.8 మిలియన్ చదరపు అడుగుల స్పేస్‌ను సంస్థలు లీజుకు తీసుకున్నాయి. అమ్జెన్, గ్లోబల్ లాజిక్, ఎలీ లిల్లీ, మారియట్, సిగ్నాలాంటి అంతర్జాతీయ సంస్థలు నగరానికి వచ్చాయి. ఏడాది వ్యవధిలో 70కి పైగా గ్లోబల్ కేపబులిటీ సెంటర్‌లు ఏర్పాటయ్యాయి. 2030 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటా ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటు-ంది. పెట్టు-బడులు తీసుకొచ్చి యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం. అభివృద్ధిని అడ్డుకునేందుకు ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయి. ప్రభుత్వంపై నమ్మకంతో పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారని శ్రీధర్‌బాబు అన్నారు. అమెరికాకు చెందిన ఫైనాన్షియల్ సేవల దిగ్గజం సిటిజన్ ఫైనాన్షియల్ గ్రూప్ తాజాగా హైదరాబాదులో టెక్ కంపెనీ కాగ్నిజెంట్ తో జతకట్టి తన గ్లోబల్ కెపాసిటీ సెంటర్ ఏర్పాటు చేసింది. ఇది హైదరాబాదులోని కాగ్నిజెంట్ క్యాంపస్ లోపలే ఉంటుందని కంపెనీ పేర్కొంది. వాస్తవానికి ఇదొక ఇన్నోవేషన్ హబ్ మాదిరిగా వర్క్ చేస్తుందని కంపెనీ వెల్లడించింది.

## నవజాత శిశువు మిస్సింగ్ అయితే హాస్పిటల్ లైసెన్స్ ను రద్దు చేయాలి

(మొదటి తరువాయి)

తకఠిన మార్గదర్శకాలు ఇచ్చింది. ఉత్తరప్రదేశ్‌లో ఇటీవల ఒక ఆస్పత్రిలో నవజాత శిశువు చోరీకి గురయ్యాడు. దాంతో చిన్నారి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటికే ఆ శిశువును విక్రయించిన దుండగుడిపై ఎఫ్ఐఆర్ నమోదైంది. ఆ తర్వాత అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించిన దంపతులకు నిరాశే మిగిలింది. కేసును విచారించిన న్యాయస్థానం నిందితుడికి బెయిల్ మంజూరు చేసింది. దాంతో తమకు న్యాయం జరగలేదని ఆరోపిస్తూ.. బాధిత దంపతులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇప్పుడు ఈ కేసును అత్యున్నత న్యాయస్థానం విచారించింది. చిన్నారుల అక్రమ రవాణా కేసులపై యూపీ ప్రభుత్వ తీరుపైన, నిందితుడికి బెయిల్ మంజూరు చేసిన అలహాబాద్ హైకోర్టుపైన సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తంచేసింది. అక్రమ రవాణాకు సంబంధించిన పెండింగ్ కేసుల విచారణ దేశవ్యాప్తంగా ఎలా కొనసాగుతోందో తెలియజేయాలని హైకోర్టులను ఆదేశించింది. అంతేగాక నిందితుడి బెయిల్‌ను రద్దు చేసింది. శిశువుల అక్రమ రవాణా కేసులకు సంబంధించిన విచారణను 6 నెలలలోపు పూర్తిచేయాలని, రోజూవారీ విచారణను కూడా నిర్వహించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీచేసింది. ఏ ఆస్పత్రిలోనైనా శిశువుల అక్రమ రవాణా జరిగినట్లు తేలితే లైసెన్స్ రద్దు చేయాలని ఆర్డర్ వేసింది. నిందితులను సకాలంలో పట్టుకోవడంలో పోలీసులు విఫలమయ్యారని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

## ఢిల్లీ కాలుష్యానికి చెక్ పెట్టాల్సిందే

(మొదటి తరువాయి)

పెట్రోల్, డీజిల్ కాలుష్యానికి ప్రధాన కారణాలు కాబట్టి వాహనాల్లో ఉపయోగించే ఇంధనంలో మార్పు అవసరమన్నారు. మనం దాదాపు రూ.22 లక్షల కోట్ల విలువైన శిలాజ ఇంధనాలను దిగుమతి చేసుకుంటు-న్నామని.. వాటికి ప్రత్యామ్నాయ ఇంధనాలు వినియోగించాల్సిన సమయం వచ్చిందన్నారు. 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను చేరుకోవాలనే లక్ష్యంతో ముందుకువెళ్తున్న భారత్ రవాణా, విద్యుత్, నీరు, కమ్యూనికేషన్ రంగాలలో ప్రపంచస్థాయి సదుపాయాలను కల్పించడంపై దృష్టిపెడుతోందన్నారు. దిల్లీలో మూడ్రోజులు ఉంటే జబ్బు చేయడం ఖాయమని అన్నారు. కాలుష్యం విషయంలో దిల్లీ, ముంబయి రెడ్‌జోన్‌లో ఉన్నాయని తెలిపారు. దిల్లీలో పరిస్థితి ఇలాగే కొనసాగితే అక్కడి ప్రజల ఆయుర్దాయం 10 ఏళ్లకు తగ్గుతుందని.. వైద్య పరిశోధనను ఉటంకిస్తూ పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రజలు మేల్కొని శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని సూచించారు. రాష్ట్రాల్లో మౌలిక సదుపాయాల కల్పన, ఆర్థిక వ్యవస్థకు ఏవిధంగా ప్రాధాన్యం ఇస్తామో అలాగే పర్యావరణాన్ని కూడా ముఖ్యమైన విషయాల్లో ఒకటిగా పరిగణించాలన్నారు. కాలుష్యాన్ని ఎదుర్కోవడానికి రహదారుల మౌలిక సదుపాయాల కల్పన కూడా ఓ పరిష్కారంగా పని చేస్తుందని గడ్కరీ పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన దేశాల లాజిస్టిక్ ఖర్చులు 12 శాతం లోపు ఉంటే మన ఖర్చులు 16శాతం వరకు ఉన్నాయని.. 2026 చివరి నాటికి వాటిని సింగిల్ డిజిట్‌కు తగ్గించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా స్విస్ ఎయిర్ క్వాలిటీ టెక్నాలజీ కంపెనీ ఐక్యూ ఎయిర్ కాలుష్యంపై రూపొందించిన 'ద వరల్డ్ ఎయిర్ క్వాలిటీ- రిపోర్ట్ 2024' నివేదిక ఇటీవల విడుదలైంది.

## రాష్ట్రంలో ఇచ్చిన హామీల నెరవేరుస్తున్నాం

(మొదటి తరువాయి)

చేపట్టిన చరిత్రాత్మక నిర్ణయాల గురించి వివరించారు. 21 వేల కోట్లతో రైతు రుణమాఫీ, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం, యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్స్, 56 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాల నియామకం, 8 వేల కోట్లతో యువతకు అవకాశాలు, సన్న ధాన్యంపై రూ.500 బోనస్, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. ఇవి కేవలం సంఖ్యలు మాత్రమే కాదు, ప్రజల జీవితాల్లో నిజమైన మార్పును తీసుకొస్తున్నాయని అన్నారు. సంక్షేమం ఒక ఎత్తైతే, సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన చరిత్రాత్మక నిర్ణయాలు మరో ఎత్తని ఆయన పేర్కొన్నారు. 'ఎస్సీ వర్గీకరణ, బీసీ కుల గణన వంటి అంశాలను మేము పకడ్బందీగా పూర్తి చేశాం. ఈ రెండు అంశాలు గత దశాబ్దాలుగా ఎందరో గొప్ప నాయకులు సాధించలేనివి. మన ప్రభుత్వం ధైర్యంగా, అందరితో చర్చించి, పారదర్శకంగా ఈ లక్ష్యాలను నెరవేర్చిందని విక్రమార్క గర్వంగా చెప్పారు. ఈ నిర్ణయాలు దేశవ్యాప్తంగా ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తాయని, ఇప్పటికే బీసీ కుల గణన, ఎస్సీ వర్గీకరణ కోసం డిమాండ్ మొదలైందని ఆయన అభిప్రాయపడ్డారు. 'ఎన్నికల ముందు రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లును ఆమోదించాం. ఇది సామాజిక న్యాయం దిశగా కాంగ్రెస్ చేసిన గొప్ప అడుగని ఆయన వివరించారు. కాంగ్రెస్ పార్టీ గతంలో భూసంస్కరణల వంటి సాహసోపేత నిర్ణయాలు తీసుకుందని, అందుకే దేశంలో సుదీర్ఘ కాలం అధికారంలో కొనసాగిందని విక్రమార్క గుర్తు చేశారు. అయితే, బీసీ కుల గణన, ఎస్సీ వర్గీకరణ వంటి నిర్ణయాలు గతంలో పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీలకు రుచించడం లేదని ఆయన విమర్శించారు.

## ప్రభుత్వాన్ని కూలుస్తామంటే ఊరుకోం

(మొదటి తరువాయి)

ఏ విధంగా లూటీ చేసిందో అనటానికి.. కొత్త ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యలే నిదర్శనం అంటూ దుమ్మెత్తిపోశారు. దుబ్బాక బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తోపాటు- మంత్రులు, ఎమ్మెల్యే స్పందించారు. కాంగ్రెస్ పాలనతో విసుగు చెందిన బిల్డర్లు, పారిశ్రామిక వేత్తలు ప్రభుత్వాన్ని పడగొట్టాలంటున్నారని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ మంత్రులు, నేతలు కౌంటర్ ఇచ్చారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ స్పందిస్తూ.. చోటామోటా కాంట్రాక్టర్లు కూల్చితే కూలే ప్రభుత్వం కాదని, ఎమ్మెల్యేల సంపూర్ణ మద్దతు తనకు ఉందని చెప్పారు. చోటామోటా బ్యాచ్‌కి భయపడమని, బీఆర్ఎస్ పదేండ్లు యథేచ్ఛగా దోచుకుందని ఆయన మండిపడ్డారు. బీఆర్ఎస్ కు అమ్ముడు, కొనుగోలుపై అనుభవం ఉందని, ఎమ్మెల్యేలు సంతలో పశువులు కాదని పీసీసీ చీఫ్ కౌంటర్ ఇచ్చారు. ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ నేతలకు కనీస గౌరవం లేదని, డబ్బులకు అమ్ముడు పోయే ఎమ్మెల్యేలని బీఆర్ఎస్ అంటోందని, ప్రభుత్వ పెద్దలతో చర్చించి కొత్త ప్రభాకర్ వ్యాఖ్యలపై తగిన నిర్ణయం తీసుకుంటామని పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ చెప్పారు.

## నేటి నుంచి జపాన్ పర్యటనకు సీఎం రేవంత్

(మొదటి తరువాయి)

జపాన్ లో పర్యటించనుంది. టోక్యో, మౌంట్ ఫుజి, ఒసాకా, హిరోషిమా లో ముఖ్యమంత్రి బృందం పర్యటించనుంది. ఓసాకా వరల్డ్ ఎక్స్పో 2025లో తెలంగాణ పెవిలియన్ ను ప్రారంభిస్తారు. ఈ పర్యటనలో భాగంగా ఆ దేశానికి చెందిన ప్రముఖ కంపెనీలు, పారిశ్రామిక వేత్తలు, పలువురు ప్రతినిధులతో ముఖ్యమంత్రి బృందం సమావేశ మవుతుంది. రాష్ట్రంలో పెట్టు-బడులు, పారిశ్రామిక సాంకేతిక సహకారంపై ప్రధానంగా చర్చలు జరుపనున్నారు.

## ప్రభుత్వాన్ని కూల్చే కుట్రలో బీఆర్ఎస్ నేతలు

(మొదటి తరువాయి)

కోరుతున్నారంటూ భారాస ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం ఏర్పడిన వారం నుంచే అధికార దాహంతో కూల్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. హైదరాబాద్‌లో మంగళవారం మీడియాతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పార్టీలు, మతాలు, కులాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని పొంగులేటి తెలిపారు. అర్హులైన అందరికీ సన్న బియ్యం అందిస్తున్నామని చెప్పారు. ఎస్సీ వర్గీకరణపై ఇప్పటికే జీవోను విడుదల చేశామన్నారు. 'భూభారతి' వచ్చాక కొత్త ప్రభాకర్‌రెడ్డి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. గతంలో అక్రమంగా భూములు కొల్లగొట్టారు. వాటిని భూభారతి ద్వారా ప్రభుత్వం తిరిగి తీసుకుంటుంది. అందుకే ఆయన భయాందోళనకు గురవుతున్నారు. కేసీఆర్ సూచన మేరకే ప్రభాకర్‌రెడ్డి ఆ వ్యాఖ్యలు చేశారు.

## తెలుగు పంచాంగం 16/4/2025,బుధవారం



సూర్యోదయం - సూర్యాస్తమయం
సూర్యోదయం: ఉదయం 6:03
సూర్యాస్తమయం: సాయంత్రం 6:28
తిథి
కృష్ణ తృతీయ: ఉదయం 10:55 వరకు
కృష్ణ చతుర్థి: ఉదయం 10:55 నుండి రేపు మధ్యాహ్నం 1:17 వరకు
నక్షత్రం
అనూరాధ: రాత్రి 3:10 వరకు
జ్యేష్ఠ: రాత్రి 3:10 నుండి రేపు ఉదయం 5:55 వరకు
యోగం
వ్యతీపాతము: రాత్రి 11:32 వరకు
వర్యాణం: రాత్రి 11:32 నుండి రేపు రాత్రి 12:18 వరకు
అశుభ సమయాలు (దోషకాలాలు)
రాహుకాలం: మధ్యాహ్నం 12:16 - 1:49
యమగండం: ఉదయం 7:36 - 9:09
దుర్ముహూర్తం: మధ్యాహ్నం 12:00 - 12:44
వర్జ్యం: ఉదయం 7:37 - 9:24 ? ?
శుభ సమయాలు (శుభ ముహూర్తాలు)
అభిజిత్ ముహూర్తం: లభ్యం కాదు
అమృతకాలం: సాయంత్రం 6:18 - 8:05
బ్రహ్మ ముహూర్తం: ఉదయం 4:26 - 5:14

# కాంగ్రెస్ పార్టీకి రక్షణ కవచం బీ.జే.పీ





-కాంగ్రెస్ పార్టీనీ నిందిస్తే బి.జె.పీకి నొప్పి పుడుతుంది
-బి.జె.పి,కాంగ్రెస్ పార్టీల చీకటి స్నేహం
-పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిన రేవంత్ రెడ్డి తెలంగాణ ముద్దుబిడ్డనా?
-తెలంగాణ ప్రజలకు అండదండ గులాబీ జెండా
-గోపాల్ పేట మండల రజతోత్సవ సన్నాహక సమావేశంలో సింగిరెడ్డిరెడ్డి

**గోపాలపేట, ఏప్రిల్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఏప్రిల్ 27న వరంగల్ నందు జరగబోవు రజతోత్సవ సన్నాహక సమావేశం ఈరోజు గోపాల్ పేట మండల కేంద్రంలో పార్టీ అధ్యక్షులు బి.బాలరాజు అధ్యక్షతన జరిగింది.ఇట్టి సమావేశంలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు.నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ ఈ రాష్ట్రనికి అండ కె.సి.ఆర్ గులాబీ జెండా అని బి.జె.పి,కాంగ్రెస్ పార్టీలు చీకటి స్నేహం చేస్తూ రాష్ట్ర ప్రజల ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తున్నాయని అన్నారు. అందుకే తెలంగాణ అస్థిత్వం కాపాడేది కె.సి.ఆర్ అని అన్నారు.పాలమూరు ముద్దుబిడ్డను అని చెప్పుకొనే రేవంత్ రెడ్డి కేవలం 600కోట్లు ఖర్చు పెడితే 12లక్షల ఎకరాలకు సాగు నీళ్ళు ఇవ్వవచ్చని ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.మార్కెట్ యార్డ్ ఏర్పాటులో నిబంధనలు పాటించకుండా కాంగ్రెస్ ఆర్భాటం చేస్తున్నారు. మండలంలో మార్కెట్ యార్డ్ ఏర్పాటు చేయాలంటే ప్రాథమిక నోటిఫికేషన్ ఇస్తారు దాని తరవాత తుది నోటిఫికేషన్ తర్వాత గెజిట్ వస్తుంది ఈ నిబంధనలు పాటించకుండా ప్రజలను మభ్యపెట్టడానికి శంకుస్థాన చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అన్ని రంగాలలో విఫలమైందని కరెంట్ కోతలు,సాగు నీళ్ళు లేక పంటలు ఎండిపోతున్నాయని రైతులకు రుణమాఫీ లేదని,రైతు భరోసా లేదని,రైతు బీమా లేదని,యువకులకు 2లక్షల ఉద్యోగాలు లేవని,మహిళలకు 2500లేవని,తులం బంగారం లేదని,రైతు కూలీలకు 12000 లేవని, రియల్ ఎస్టేట్ కుదేలు అయిందని భూముల ధరలు సగానికి పడిపోయాయని జీవనాధారం కోల్పోయి రియల్టర్స్,మధ్యవర్తులు ఆత్మహత్యలకు పాల్పడు తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అన్ని రంగాలలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు కె.సి.ఆర్ రజతోత్సవ సభకు సంకల్పించారని లక్షలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచారు. ప్రతి గ్రామములో సమావేశాలు ఏర్పాటు చేసుకొని గులాబీ జెండా ఆవిష్కరణ చేసి బయలుదేరాలని సోషల్ మీడియా వేదికగా ప్రచారం నిర్వహించాలని కోరారు. ఈ సమావేశములో జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్,జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్,బి.బాలరాజు,మాజీ ఎం.పి.పిసంధ్య, తిరుపతయ్య ,చంద్రశేఖర్, శేఖర్,తిరుపతి రెడ్డి,మాజీ సర్పంచ్ శ్రీనివాసులు మతీన్,సయ్యద్. జమీల్,సునీల్ వాల్మీకి,రాజేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మానసిక శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరిచే ఔషధం వంటిది కళ

-మనుషులను సామాజిక అవగాహన వైపు నడిపిస్తుంది కళ
- గంగవరం రామకృష్ణారెడ్డి



**వనపర్తి,ఏప్రిల్ 15 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ ):**
కళాకారులలో ఉన్నకళ మానసిక శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి ఔషధంగా పనిచేస్తుందని, మానవులను సామాజిక అవగాహన వైపు నడిపించే ఒక సాధనం లాంటిది కళ అని మంగళవారం ప్రపంచ ఆర్ట్ డే సందర్భంగా వనపర్తి కాంటెస్ట్ ఎమ్మెల్యే గంగవరం రామకృష్ణారెడ్డి అన్నారు. కళాకారులు తమ సృజనాత్మకత నైపుణ్యాలను ఊహలను ఉపయోగించి దృశ్య రూపంలో కానీ, శ్రవణ రూపం లో కానీ ప్రజలకు సులువుగా అర్థమయ్యే రీతిలో సృష్టించిన రూపమేకళ లేక ఆర్ట్ అని అంటాం.ఏప్రిల్ 15 ప్రపంచ ఆర్ట్ డే సందర్భంగా, ప్రపంచవ్యాప్తంగా ముఖ్యంగాతెలంగాణ కవులకు,కళాకారులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. కళాకారులను, కళాత్మక సృజనను, కళయొక్క ప్రాముఖ్యతను దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా విస్తరింప చేయాలని ప్రతి కళాకారుడు లియోనార్డ్ వలె జ్ఞానాన్ని మానవత్వాన్ని కలిగి ఉంటారని ఆయన అన్నారు. కావున ప్రతి కళాకారుని గౌరవించడం మనసాంప్రదాయంతో పాటు, కళాకారులు భవిష్యత్ తరాలకు అవసరం వారిని కాపాడుకునే బాధ్యత మనందరిపై ఉందని ఆయన అన్నారు. కళాకారులను ప్రోత్సహిద్దాం, సృజనాత్మకతను పెంపొందిద్దాం, సంస్కృతల వైవిధ్యాలను ప్రోత్సహించుకుందాం, అని ఆయన పిలుపునిచ్చారు.

# భూ భారతి చట్టంపై గ్రామస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలి.

రెవెన్యూ అధికారులకు జిల్లా కలెక్టర్ శ్రీ ఆదర్ష్ సురభి ఆదేశం



**వనపర్తి,ఏప్రిల్ 15( నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన భూభారతి చట్టం పై క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం కలెక్టర్ తన ఛాంబర్ లో కలెక్టరేట్ సూపరింటెండెంట్ లతో భూ భారతి చట్టం పై రైతులకు అవగాహన కల్పించడం పై సమీక్ష నిర్వహించారు. భూ భారతి చట్టం- 2025 పై రైతులకు అవగాహన కల్పించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు. ఏప్రిల్, 17 నుండి మండలాల వారీగా రైతు వేదికల్లో రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి చట్టం పై అవగాహన, అనుమానాలను నివృత్తి చేయాలని సూచించారు. ధరణి స్థానంలో వచ్చిన భూ భారతి చట్టం- 2025 ప్రకారం ఒకేరోజు రిజిస్ట్రేషన్ తో పాటు మ్యుటేషన్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. అయితే రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేసే ముందు సంబంధిత భూమి సర్వే చేసే మ్యాప్ తయారు చేయడం జరుగుతుంది. తహసిల్దార్ ద్వారా భూ రిజిస్ట్రేషన్ అయిన వెంటనే మ్యుటేషన్ చేస్తారని తద్వారా నెలల తరబడి మ్యుటేషన్ కొరకు తిరగటం ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవడం ఉండదన్నారు. అదేవిధంగా ప్రతి రిజిస్ట్రేషన్ భూమికి పట్టాదార్ పాస్ పుస్తకంలో హద్దులతో కూడిన చిత్రపటం ఉంటుందని, భూదాన్ యూనిక్ గుర్తింపు నెంబరు కేటాయించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే ధరణిలో పెండింగ్ ఉన్న ఫిర్యాదులను నిర్ణీత గడువులోపు పరిష్కరించేందుకు చట్టంలో వెసులుబాటు కల్పించారని తెలియజేశారు. హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం ఉంటుంది. పెండింగ్ సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం, భూ సమస్యల పరిష్కారానికి రెండెంచెల అప్పీల్ వ్యవస్థ ఉంటుంది. రైతులకు ఉచిత న్యాయ సహాయం, గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ ఉంటుందని, మోసపూరితంగా హక్కుల రికార్డులు ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్, ఎండోమెంట్, వక్ఫ్ భూములకు పట్టాలు పొందితే రద్దు చేసే అధికారం భూ భారతి చట్టంలో కల్పించడం జరిగిందన్నారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లు, సెక్షన్ సూపరింటెండెంట్ లు పాల్గొన్నారు.

## పిల్లల ఎదుగుదలకు పౌష్టికాహారం అందించాలి..

సిడిపిఒ షబానా బేగం..



**షాద్ నగర్, ఏప్రిల్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు పౌష్టికాహారాన్ని అందించాలని ఐసీడీఎస్ సిడిపిఒ షబానా బేగం అన్నారు. పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా లింగారెడ్డిగూడ గ్రామంలో గల అంగన్‌వాడీ 2 కేంద్రం లో టీచర్ అమృత ఆధ్వర్యంలో పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. బరువు తక్కువగా ఉన్న చిన్నారులకు సరైన పౌష్టికాహారం అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ జయలక్ష్మి ,గ్రామ పంచాయతీ కార్యదర్శి అర్జున్ కుమార్, ఆశ కార్యకర్తలు సరళ, మహిళా సంఘం అధ్యక్షురాలు జి మాధవి, బి మంగమ్మ ,మరియు మహిళా సంఘం సభ్యులు అంగన్వాడి ఆయా కృష్ణమ్మ పాల్గొనడం జరిగింది..

## పోషణ పక్షం కార్యక్రమంలో పాల్గొన్న సీపీడీవో శాంతి సురేఖ



**రంగారెడ్డి జిల్లా,ఏప్రిల్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా (ఆమనగల్ ప్రాజెక్ట్ ) మరియు తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ సెక్రటరీ రాం పూర్ గ్రామంలో అంగన్వాడి 1-2 కేంద్రాల్లో పోషణ పక్షము కార్యక్రమంలో భాగంగా నేడు అతి తీవ్రత పోషణలో ఉన్న పిల్లలను పునరావాస కేంద్రం ఎన్ ఆర్ సి ముందస్తు రఫెరల్ చేయడము యొక్క ప్రాముఖ్యతపై సమాజానికి అవగాహన కల్పించడానికి అంగన్వాడి కేంద్రాల్లో రిఫరల్ అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది అని వివరించిన ఆమనగల్ సిడిపిఓ శాంతి సురేఖ పాల్గొనడం జరిగింది ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ తిరుమల అంగన్వాడి టీచర్లు ఎం పద్మ లక్ష్మీదేవి మహిళా తల్లులు ఆయాలు తదితరులు పాల్గొనడం జరిగింది.

## తలకొండపల్లి మండలంలో “జై బాపు-జై భీమ్-జై సంవిధాన్” పాదయాత్ర ప్రారంభం



**తలకొండపల్లి, ఏప్రిల్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ప్రజాస్వామ్య రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేయడం ప్రతి పౌరుడి బాధ్యత అని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. తలకొండపల్లి మండల్ లో “జై బాపు-జై భీమ్-జై సంవిధాన్” పాదయాత్రను జెండా ఎగరవేసి ప్రారంభించారు. ఈ పాదయాత్రలో వెంకటాపూర్ తండా, పెద్దూరుతండా, దేవుని పడకలు, పడకల్, లింగరావుపల్లి గ్రామాలలో రాజ్యాంగంపై జరుగుతున్న దాడులను ప్రజలకు వివరించారు. ప్రజా ప్రభుత్వ పథకాలను గడప గడపకు తీసుకెళ్లడం ద్వారా ప్రజలలో అవగాహన కల్పించడమే ఈ యాత్ర ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పాదయాత్ర సందర్భంగా పడకల్ గ్రామంలో ధాన్యం మరియు సన్ ఫ్లవర్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పిఏసీఎస్ చైర్మన్, ఏఎంసీ డైరెక్టర్స్, తలకొండపల్లి మండల్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యులు, సీనియర్ నాయకులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తలకొండపల్లి మండల్ ఇన్చార్జి ఏనుగు జగ్గారెడ్డి, ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీతా నరసింహ, పీసీసీ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, తలకొండపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డోకురు ప్రభాకర్ రెడ్డి, కాసు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు..

# నేత్రదానం మహాదానం




**ఆమనగల్లు, ఏప్రిల్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

నేత్రదానం సామాజిక బాధ్యతతో కూడిన శ్రేష్ఠమైన దానం అని నేత్ర వైద్యులు డాక్టర్ ఏం. చంద్రశేఖర్ అన్నారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, రామ్ రెడ్డి లయన్స్ ఐ హాస్పిటల్, లయన్స్ క్లబ్ ఆఫ్ అమనగల్లు సంయుక్త భాగస్వామ్యంతో ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ నేత్రదానం చేయడం ద్వారా ఇద్దరికి కంటి చూపును ఇవ్వగలమని చెప్పారు. కంటి శుభ్రతకు విశేష ప్రాముఖ్యత ఇచ్చి, 50-60 ఏళ్ల వయస్సులో ఉన్నవారు పోషకాహారాన్ని సమృద్ధిగా తీసుకుంటే కంటి సమస్యలు తగ్గించవచ్చని సూచించారు. కంటి సంబంధిత సమస్యలు ఎదుర్కొంటున్న వారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నాయకత్వంలో చికిత్స పొందగలరని ఆయన తెలిపారు. ఈ శిబిరంలో మొత్తం 72 మందికి కంటి పరీక్షలు చేయగా, అందులో 40 మందికి కంటి ఆపరేషన్ అవసరమని గుర్తించి, వారిని రామ్ రెడ్డి లయన్స్ ఐ హాస్పిటల్‌కు తరలించినట్లు క్లబ్ పిఆర్ఓ పాషా వెల్లడించారు. క్లబ్ అధ్యక్షులు పసుల లక్ష్మారెడ్డి, కార్యదర్శి దోనాదుల మహేష్, పిఆర్ఓ పాషా తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నేత్రదానంపై యువతకు అవగాహన కల్పించడం కోసం, ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు.

# అకాల వర్షం రైతన్నకు కష్టం


-ప్రభుత్వమే ఆదుకోవాలంటున్న అన్నదాతలు



**కొందుర్గ్, ఏప్రిల్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

ఈరోజు కురిసిన భారీ వడగండ్ల వర్షం, బాగా వీచిన గాలి కారణంగా కొందుర్గ్ మండలంలోని లక్ష్మీదేవునిపల్లి గ్రామంలో భారీ నష్టం జరిగింది. గాలివాన కారణంగా మామిడి తోటల మామిడికాయలు కింద పడి తీవ్రంగా దెబ్బతిని ఎందుకు పనికి రాకుండా పోయాయి. భారీ వర్షంతో పాటు విపరీతమైన గాలివీయడంతో గాలి తాకిడికి, వడగండ్ల వర్షానికి కోళ్ల ఫారం పై కప్పు రేకులు విరిగిపోయి కింద పడి పూర్తిగా పాడయ్యాయి. ఈ ఊహించని ఘటనతో రైతులతో పాటు కోళ్ల ఫారం యజమానులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఇప్పుడే పంట దిగుబడి ఆశిస్తూ ఎదురుచూస్తున్న రైతులు గుండెలు అరచేతిలో పట్టుకొని కూర్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులు తక్షణమే స్పందించి నష్టాన్ని అంచనా వేసి, రైతులకు పరిహారం అందజేయాలని గ్రామస్థులు, రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## నాగర్ కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభల అధ్యక్షులు బచ్చు రామకృష్ణ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు



**వెల్దండ ఏప్రిల్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్):**

హైదరాబాద్ లోని నోవాటెల్ హొటల్ లో నాగర్ కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ ల అధ్యక్షులు బచ్చు రామకృష్ణ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మహబూబ్నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కూచు కుళ్ళ రాజేష్ రెడ్డి మక్తల్ ఎమ్మెల్యే వాకేటి శ్రీహరి ఎమ్మెల్సీలు దామోదర్ రెడ్డి నాగర్ కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభల అధ్యక్షులు బచ్చు రామకృష్ణకు శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు ఈ వేడుకల్లో వెల్దండమాజీ సర్పంచ్ యెన్నం భూపతి రెడ్డి బృంగి ఆనంద్ కుమార్ సంజీవ్ యాదవ్ శశిపాల్ రెడ్డి రాంరెడ్డిలో తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలం జాతీయ.రహదారిపై వ్యక్తి దారుణ హత్య



**అచ్చంపేట ఏప్రిల్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్):**

అచ్చంపేట పట్టణ పరిధిలోని నడింపల్లి గ్రామ సమీపంలోని ఇటుకల బట్టీల వద్ద రోడ్డు మీద బైక్ పై ప్రయాణిస్తున్న ఈశ్వరయ్య పై గుర్తుతెలియని దుండగులు కారులో వెంబడించి గొడ్డలితో నరికి చంపారు అచ్చంపేట హైదరాబాద్ ప్రధాన జాతి వారిపై వృత్తిని కుటుంబ సభ్యులు బంధువులు ఆందోళన చేపట్టారు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# పాఠకులకు గమనిక:




మీరు ఎదుర్కొంటున్న సమస్యలను వివరణాత్మకంగా మాకు తెలియజేయండి. ప్రభుత్వ అధికారుల మరియు ప్రజల మధ్య వారధిగా నిలిచి, మా ప్రత్యేక విలేకరుల బృందం సంబంధిత అధికారులను సంప్రదించి, పరిష్కారం కోసం కృషి చేస్తుంది.

మమ్మల్ని సంప్రదించడానికి:

ఇమెయిల్: neelagiriexpress@gmail.com

సంప్రదింపు నెంబర్: **9705770909**

మీ ప్రతిభావంతమైన భాగస్వామ్యంతో సమాజానికి మంచి మార్పు తీసుకురావడం మా లక్ష్యం.

**మీ గొంతుకకు మేమే వేదిక - నీలగిరి ఎక్స్‌ప్రెస్!**

# జర్నలిస్ట్ రాపోలు లింగస్వామి కి ఉగాది పురస్కారం






**- సుప్రీం కోర్టు 48వ మాజీ ప్రధాన న్యాయమూర్తి నూతలపాటి వెంకటరమణ చేతుల మీదుగా అవార్డు స్వీకరణ**

**అమరావతి, ఏప్రిల్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

తెలుగు జర్నలిస్ట్ ల సంక్షేమ సంఘం ప్రతి సంవత్సరం ఉగాది పురస్కారాలను పలు విభాగలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన జర్నలిస్ట్ లకు అవార్డుల ప్రదానం చేస్తుంది. (2024-2025)సంవత్సరానికి గాను ఈ అవార్డుల జాభితాను టి జె ఎస్ ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మేడవరపు రంగనాయకులు తాజాగా ప్రకటించారు. ఈ సంవత్సరానికి గాను రెండు తెలుగు రాష్ట్రాల్లో అర్హులైన పలువురు జర్నలిస్టుల 100 మంది పేర్లను ప్రకటించగా తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ కు చెందిన జర్నలిస్ట్, సామాజిక కార్యకర్త రాపోలు లింగస్వామిని మనవీయ కోణాన్ని ఆవిష్కరించిన జర్నలిస్ట్ గా ఎంపిక అవ్వడం జరిగింది. విజయవాడ లో తుమ్మలపల్లి కలక్షేత్రంలో తెలుగు జర్నలిస్ట్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉగాది పురస్కారం ప్రధానోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి నూతలపాటి వెంకటరమణ (మాజీ) హాజరై నిర్వాహకులతో కలిసి రాపోలు లింగస్వామి కి ఉగాది పురస్కారం, ప్రశంశ పత్రం, 5000 రివార్డు, శాలువా తో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విలువలరో కూడిన పాత్రికేయులకు సమాజంలో ఎల్లప్పుడూ గౌరవం ఉంటుందన్నారు. అప్పట్లో తాను కూడా పాత్రికేయు రంగంలో పనిచేసిన అనుభవాలతో కూడిన జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పాత్రికేయ రంగం పై ఉన్న అపోహలను తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలల్లో విలువలతో కూడిన ఉత్తమ జర్నలిస్ట్ లకు ఉగాది పురస్కారం తో సత్కరించిన తెలుగు జర్నలిస్ట్ ల సంక్షేమ సంఘం భవిష్యత్లో మరిన్ని కార్యక్రమాలను నిర్వహించాలని ఆకాక్షించారు. సామాన్య మధ్య తరగతి కుటుంబం లో పుట్టిన రాపోలు లింగస్వామి హైదరాబాద్ లో జర్నలిస్ట్ గా పని చేస్తూనే ఆర్ టి ఐ, సామజిక కార్యకర్తగా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించడం సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు తన వంతు నిరంతరం కృషి కి ఫలితంగా గతంలో పలు అవార్డులు, ప్రముఖుల నుండి ప్రశంసలు, సమాజంలో తన కంటూ ఒక ప్రత్యేకత ను చాటుకుంటున్న రాపోలు లింగస్వామి కి తాజగా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉత్తమ జర్నలిస్ట్ ల జాభితాలో మానవీయ కొణాన్ని ఆవిష్కరించిన జర్నలిస్ట్ గా ఉగాది పురస్కారం ను సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి నూతలపాటి వెంకటరమణ (మాజీ)చేతుల మీదుగా అందుకోవడం తో అతని సేవలను గుర్తు చేస్తూ పలువురు అభినందనలు తెలియజేస్తున్నారు.

# విజయ కార్డియాక్ & మేటర్నిటీ మరియు జనని చిన్న పిల్లల ఆసుపత్రి అధ్వర్యంలో మెగా వైద్య శిబిరం విజయవంతం

**-పాల్గొన్న డాక్టర్ చందులాల్ రాథోడ్, డాక్టర్ విజయలక్ష్మి**

**షాద్ నగర్, ఏప్రిల్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం నందిగామ మండలం మస్జీద్ మామిడిపల్లి గ్రామం లో ఈ రోజు విజయ కార్డియాక్ & మేటర్నిటీ మరియు జనని చిన్న పిల్లల ఆసుపత్రి అధ్యర్యంలో డాక్టర్ చందులాల్ కర్డియాలాజిస్ట్ & డాక్టర్ విజయలక్ష్మి అధ్యర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరం లో 221 మంది స్త్రీలు మరియు పురుషులు పాల్గొని హెల్త్ చెక్ అప్ చేయించుకున్నారు. ఇందులో గుండె సంబంధిత పరీక్షలు, షుగర్, బీపీ, ఈసీజీ తదితర పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఇందులో 70 మందికి



ఈసీజీ, కొత్తగా షుగర్,18 మందికి బీపీ,3 మందికి paralysis , 10 మందికి గుండె సంబంధిత వ్యాధి ఉన్నట్టు తెలిసింది. వారందరికీ ఉచితంగా మందులు, సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది. అదేవిదంగా జనని చిన్న పిల్లల వైద్యాశాల అధ్యర్యంలో డాక్టర్ రమాకాంత్ నాయుదు, పాల్గొని 50 మంది చిన్నపిల్లలకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, నాయకులు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించినందుకు విజయ కార్డియాక్ & మేటర్నిటీ డాక్టర్ చందులాల్, డాక్టర్ విజయలక్ష్మి గారిని శాలువ లతో సన్మానం చేసి జనని చిన్న పిల్లల ఆసుపత్రి వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరం కార్యక్రమం లో డాక్టర్ చందులాల్ రాథోడ్, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ రమాకాంత్ నాయుడు, మరియు హాస్పిటల్ సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజలందరికీ చేరవేయడమే ధ్యేయంగా జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమం

**కల్వకుర్తి ఏప్రిల్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్):**

కల్వకుర్తి పట్టణ పరిధిలోని నేడు 16/ 4/2025 బుధవారం 12 గంటలకు తాండ్ర గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి విద్యను అభ్యసించిన తాండ్ర జడ్పీహెచ్ఎస్ పాఠశాల శంకుస్థాపన మరియు అంబేద్కర్ రాజ్యాంగ పరిరక్షణ మరియు గాంధీ శాంతి సందేశం ప్రజలందరికీ చేరవేయడమే ధ్యేయంగా జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమం గడపగడపకు పాదయాత్ర నిర్వహించడం జరుగుతుంది . ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొంటారు అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామ ప్రజలు ప్రజాప్రతినిధులు మహిళలు తదితరులు పాల్గొంటారని కల్వకుర్తి కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి వివరించారు .

# చెట్టు = అమ్మ, చెత్త = రోగం

చెట్టు మన జీవితానికి అమ్మంత ప్రాముఖ్యమైనది. అది మనకు ప్రాణవాయువును అందిస్తుంది, ప్రకృతిని సంరక్షిస్తుంది, మన శ్రేయస్సుకు తోడ్పడుతుంది. చెట్టు ఉంటే జీవితం ఉందని చెప్పడం అసత్యం కాదు. మరోవైపు, చెత్త అనేది రోగాలకు కారణమవుతుంది. చెత్త ఎక్కడైతే పేరుకుపోతుందో అక్కడ పర్యావరణం కలుషితమవుతుంది, నీరు, గాలి, నేల నాశనం అవుతాయి.

**చెట్టు ఎలా అమ్మలా ఉంటుంది:**
-మనకు ఆక్సిజన్ అందిస్తుంది.
-నీడ, చల్లదనం, ఆహారం, చెక్క, ఔషధాలు అందిస్తుంది.
-ప్రకృతి మనుగడలో కీలక పాత్ర పోషిస్తుంది.

**చెత్త ఎలా రోగంగా మారుతుంది:**
-చెత్త పేరుకుపోతే దోమలు, చీమలు, బ్యాక్టీరియా పుట్టుక.
-కాలుష్యం వల్ల శ్వాసకోశ, నీరు మరియు ఆహారానికి సంబంధించిన రోగాలు.

చెట్టు మన జీవితానికి అమ్మవంటిది. అందుకే మనం చెట్లను నాటాలి, వాటిని కాపాడాలి.
చెత్త మన జీవనానికి రోగం. అందుకే చెత్తను తగ్గించాలి, పునర్వినియోగం చేయాలి, పర్యావరణాన్ని స్వచ్ఛంగా ఉంచాలి.

"ప్రకృతిని ప్రేమిద్దాం, జీవనాన్ని కాపాడుకుందాం!"
మీ నరేష్ దండు సామాజిక కార్యకర్త

# సోనియా, రాహుల్ గాంధీలపై ఈడీ ఛార్జిషీట్..!

**హైదరాబాద్ ఏప్రిల్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్):** నేషనల్ హెరాల్డ్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసింది. కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పేర్లను ప్రస్తావించింది. అలాగే, సీనియర్ కాంగ్రెస్ నేత శామ్ పిట్రోడా, సుమన్ దూబేతో సహా అనేక మంది పేర్లను పేర్కొంది. ఈ వ్యవహారంపై ఈ నెల 25న ప్రత్యేక కోర్టు విచారణ నిర్వహించనున్నట్లు సమాచారం. కాంగ్రెస్ అగ్రనేతలైన సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై ఈడీ ఛార్జిషీట్ దాఖలు చేయడం ఇదే తొలిసారి. కాగా, హర్యానాలో జరిగిన రియల్ ఎస్టేట్ ఒప్పందంతో ముడిపడి ఉన్న మనీలాండరింగ్ ఆరోపణలపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ భర్త, వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రాను ఈడీ ప్రశ్నించిన కొన్ని గంటల్లోనే చార్జిషీట్ దాఖలు చేయడం గమనార్హంఇదిలా ఉండగా.. నేషనల్ హెరాల్డ్ పేపర్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో సోనియా, రాహుల్ గాంధీని ఈడీ గతంలో విచారించింది. విదేశీ నిధులతో నేషనల్ హెరాల్డ్ పత్రికను నడిపారన్న ఫిర్యాదు మేరకు ఈడీ, సీబీఐ దర్యాప్తు చేపట్టాయి. అయితే, సీబీఐ విచారణ అర్ధాంతరంగానే నిలిచిపోగా.. ఈడీ దర్యాప్తు మాత్రం కొనసాగుతూ వస్తున్నది. ఇటీవల ఈ కేసులో 2023,




నవంబర్‌లో జప్తు చేసిన అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ కి చెందిన రూ.661 కోట్ల విలువైన ఆస్తుల స్వాధీనానికి చర్యలు ప్రారంభించి.. నోటీసులు జారీ చేసింది. ఈడీ ఇప్పటి వరకు అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్, యంగ్ ఇండియాకు చెందిన దాదాపు రూ.751.9కోట్ల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకుంది. ఆయా ఆస్తుల్లో అద్దెకు ఉంటున్న వారు తమకే ఆ మొత్తాన్ని చెల్లించాలని సూచించింది. అక్రమ చలామణి నిరోధక చట్టంలోని సెక్షన్ (8) నిబంధన 5(1) ప్రకారం జప్తు చేసిన ఆస్తులను స్వాధీనం చేసుకునే ప్రక్రియ చేపట్టినట్లు చెప్పింది. నేషనల్ హెరాల్డ్ వార్తాపత్రికను 1938లో మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ స్థాపించారు. దీన్ని అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ అంటే ఏజేఎల్ ప్రచురించింది. 2008లో ఆర్థిక సంక్షోభం తర్వాత ఈ వార్తాపత్రిక మూసివేశారు. అయితే, ఇక్కడే ఈ వివాదం ప్రారంభమైంది. దీని తర్వాత 2010లో, యంగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీ ఏర్పడింది. దీంట్లో దీనిలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ 38-38శాతం వాటాను కలిగిఉన్నారు. ఈ కేసులో బీజేపీ నేత సుబ్రహ్మణ్యస్వామి 2012లో వైఐఎల్ రూ.2వేలకోట్లకుపైగా విలువైన ఏజేఎల్ ఆస్తులను కేవలం రూ.50లక్షలకు కొనుగోలు చేసిందని.. ఇది మోసమని ఆరోపించారు. ఇక ఈడీ చార్జిషీట్‌పై కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మరికొందరు నేతలపై చార్జిషీట్ దాఖలు చేయడం అనేది ప్రధానమంత్రి, హోంమంత్రి ప్రతీకార రాజకీయాలకు పాల్పడడం, బెదిరింపులకు ప్రత్నించడమే తప్ప మరొకటి కాదన్నారు. భారత జాతీయ కాంగ్రెస్.. దాని నాయకత్వం మౌనంగా ఉండదు.. సత్యమేవ జయతే! అంటూ ట్వీట్ చేశారు.

# ఇందిరమ్మ లబ్దిదారులకు శుభవార్త

## తొలి విడతలో 12 మందికి చెక్కుల పంపిణీ

**హైదరాబాద్ ఏప్రిల్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్):** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇళ్ల కలను సాకారం చేసే దిశగా మరో అడుగు వేసింది. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మొదటి విడతలో లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందించే కార్యక్రమంలో భాగంగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం 12 మంది లబ్ధిదారులకు లాంఛనంగా ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా రూ. 20.19 కోట్లను 2,019 మంది లబ్ధిదారులకు విడుదల చేశారు. పైలట్ ప్రాజెక్ట్ కింద మొదటి విడతలో 70,122 ఇళ్లను మంజూరు చేసిన ప్రభుత్వం, ఇందులో బేస్‌మెంట్ నిర్మాణం పూర్తి చేసుకున్న 2,019 మందికి ఈ నిధులను అందించింది. ఇప్పటివరకు 13,500 ఇళ్లు గ్రౌండింగ్ పక్రియను పూర్తి చేసుకున్నాయి. ఈ పథకం ద్వారా పేదలకు సొంత ఇల్లు అనే కలను సులభతరం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నామని తెలిపారు. బేస్‌మెంట్, గోడలు లేదా శ్లాబ్ నిర్మాణం పూర్తి చేసిన లబ్ధిదారులు అధికారుల కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేదు. మీరే ఫోటో తీసి మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తే, డబ్బులు నేరుగా మీ బ్యాంక్ ఖాతాలో జమ అవుతాయని ఆయన హామీ ఇచ్చారు. ఈ వినూత్న విధానం లబ్ధిదారులకు సమయం ఆదా చేయడమే కాక, నిధుల విడుదల పక్రియను వేగవంతం చేస్తుందని అంటున్నారు. ఇళ్ల నిర్మాణం విషయంలో కొన్ని మార్గదర్శకాలను కూడా మంత్రి వివరించారు. లబ్ధిదారులు కనీసం 400 చదరపు అడుగులు, గరిష్టంగా 600 చదరపు అడుగుల లోపు ఇంటిని నిర్మించుకోవాలి. ఇది లబ్ధిదారులకు సౌకర్యవంతమైన, సమర్థవంతమైన గృహాలను అందించడంలో సహాయపడుతుందని పొంగులేటి తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం పట్ల తన నిబద్ధతను మరోసారి చాటుకుంది. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద లక్షలాది కుటు-ంబాలకు సొంత ఇల్లు అనే కలను సాకారం చేయడమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి సర్కారు పనిచేస్తోంది. ఈ పథకం రాష్ట్రంలో గృహ నిర్మాణ రంగంలో కొత్త ఒరవడిని సృష్టిస్తుందని, లబ్ధిదారుల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తుందని అంతా ఆశిస్తున్నారు

# నేడు సీఎం ఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**కద్తాల్ ఏప్రిల్ 16 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
అనారోగ్యంతో వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన బాధితులకు ప్రభుత్వం అందజేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఈ రోజు ఎంఆర్జీ గార్డెన్ మైసిగండిలో ఉదయం 08:00 గంటలకు శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి బాధితులకు అందజేయనున్నారు . కావున లబ్ధిదారులు, కాంగ్రెస్ పార్టీ కుటుంబసభ్యులు, పార్టీ ప్రజాప్రతినిధులు మరియు పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కద్తాల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీచ్యా నాయక్ ఒక ప్రకటన లో తెలిపారు.

# ఏసీబీ వలకు చిక్కిన జిహెచ్ఎంసి ఉన్నతాధికారి



**హైదరాబాద్ ఏప్రిల్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
హైదరాబాద్ పట్టణ పరిధిలోని శేర్లింగంపల్లి మున్సిపల్ జోనల్ కార్యాలయంలో ఏసీబీ దాడులు జిహెచ్ఎంసి బయో డ్రైవర్స్ టీ విభాగంలో డిప్యూటీ డైరెక్టర్ గా పనిచేస్తున్న శ్రీనివాస్ 70,000 లంచం తీసుకుంటున్న రెడ్ హ్యాండిగా పట్టుకున్న అవినీతి నిరోధక శాఖ(ACB) అధికారులు

# అభిమానుల కార్యకర్తల మధ్యన పుట్టినరోజు వేడుకలు



**ఎల్బీనగర్ ఏప్రిల్ 15(నీలగిరిఎక్స్ ప్రెస్):** గడ్డి అన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్. గడ్డి ఎన్నారం డివిజన్ బిజెపి కార్యకర్తలు అభిమానులు పాల్గొని పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు.

# సిఎం రేవంత్ కేసుపై హైకోర్టు విచారణ

**హైదరాబాద్ ఏప్రిల్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
గతంలో గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో తనపై నమోదైన కేసును కొట్టివేయాలంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. గోపన్‌పల్లిలోని భూ వివాదంలో ఓ వ్యక్తి ఫిర్యాదుతో.. 2016లో రేవంత్‌రెడ్డిపై కేసు నమోదైంది. ప్రస్తుతం ఆ కేసు రంగారెడ్డి జిల్లా కోర్టులో విచారణలో ఉంది. కేసును కొట్టివేయాలంటూ 2020లో రేవంత్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా దీనిపై విచారణ చేపట్టిన న్యాయమూర్తి జస్టిస్ కె. లక్ష్మణ్.. పిటిషన్‌ను వేరే బెంచ్‌కు బదిలీ చేయాలని రిజిస్ట్రీని ఆదేశించారు.

# బోయింగ్ విమానాలను కొనకండి.. ఎయిర్‌లైన్స్ సంస్థలకు చైనా ఆదేశం

**బీజింగ్ ఏప్రిల్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
అమెరికా, చైనా మధ్య సుంకాల యుద్ధం నడుస్తున్న విషయం తెలిసిందే. అయితే అమెరికాకు చెందిన బోయింగ్ కంపెనీ నుంచి విమానాలను ఖరీదు




చేయవద్దు అని తమ ఎయిర్‌లైన్స్ సంస్థలకు చైనా చెప్పింది. రెండు దేశాల మధ్య వాణిజ్య అగాధం ఏర్పడడం వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విదేశీ వస్తువులపై అధిక స్థాయిలో సుంకాలు వసూల్ చేస్తున్న విషయం తెలిసిందే. చైనా దిగుమతులపై సుమారు 145 శాతం సుంకాలు వసూల్ చేసేందుకు ట్రంప్ సర్కారు నిర్ణయించింది.అమెరికా తీసుకున్న నిర్ణయాన్ని డ్రాగన్ దేశం తీవ్రంగా ఆక్షేపించింది. అగ్రరాజ్యం చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు చైనా పేర్కొన్నది. దీంతో ప్రతీకారంగా అమెరికా వస్తువులపై 125 శాతం సుంకాన్ని వసూల్ చేసేందుకు నిర్ణయించింది. అమెరికా కంపెనీ నుంచి విమాన పరికరాలు, విడిభాగాల కొనుగోలును నిలిపివేయాలని ఎయిర్‌లైన్స్ సంస్థలకు చైనా ఆదేశాలు జారీ చేసింది. దిగుమతి వస్తువులపై సుంకాలు పెరగడం వల్ల.. విమాన పరికాల ధర మరింత పెరిగినట్లు చైనా భావిస్తున్నది.

# వడ్డీలేని రుణాలతో మహిళలకు స్వయం ఉపాధి

## స్త్రీ సమ్మిట్ కార్యక్రమంలో భట్టి విక్రమార్క


**హైదరాబాద్ ఏప్రిల్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
వడ్డీలేని రుణాలతో మహిళలకు స్వయం ఉపాధి అవకాశం లభించిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం నడుస్తోందని, సెల్ఫ్ హెల్ప్ గ్రూపులుకు ఫ్రీ రుణాలు ఇస్తున్నామని చెప్పారు. స్వయం సహాయక గ్రూపులకు రూ.20 వేల కోట్లకు పైగా లోన్లు ఇస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్ తాజ్ డక్కన్ హోటల్ లో నిర్వహించిన స్త్రీ సమ్మిట్ 2.0 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు భట్టీ-. హైదరాబాద్




సిటీ సెక్యూరిటీ- కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని ప్రారంభించి డిప్యూటీ సీఎం.. మహిళా సాధికారత కోసమే స్త్రీ సమ్మిట్ నిర్వహిస్తున్నామని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఈ సందర్భంగా డిప్యూటీ-సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఒకవైపు స్త్రీలను దేవతలుగా చూస్తేనే మరోవైపు కంట్రోల్ చేయాలనే ప్రయత్నం తరతరాలుగా జరుగుతూనే ఉందని అన్నారు. హిందూ కోడ్ బిల్లుతోనే మహిళా సాధికారత ప్రారంభం అయ్యిందని, అంబేద్కర్ వల్లే మహిళలకు హక్కులు లభించాయని గుర్తు చేశారు. మహిళలకు వారతసత్వ హక్కులు లభించాయని తెలిపారు. తెలంగాణలో మహిళలకు ఫ్రీ బస్ స్కీం సక్సెస్ ఫుల్ గా నడుస్తోందని అన్నారు డిప్యూటీ- సీఎం. సోలార్ ఎలాంట్ నిర్వహణ మహిళా సంఘాలకు అప్పగించామని, దీంతో సోలర్ ఎలాంట్ నిర్వహణలో మహిళలకు భాగస్వామ్యం లభించిందని అన్నారు. ఇలాంటి స్త్రీ సమ్మిట్ లతో మహిళా సాధికారత సాధించవచ్చుని పిలుపునిచ్చారు.


# బిజినెస్

## స్టాక్ మార్కెట్‌లో బుల్ జోరు.. 76వేలు దాటిన సెన్సెక్స్..



**హైదరాబాద్ ఏప్రిల్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్):** భారత స్టాక్ మార్కెట్‌లో బుల్ జోరు కొనసాగింది. ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతీకార సుంకాలు.. చైనా-అమెరికా వాణిజ్య యుద్ధాల నేపథ్యంలో మార్కెట్లు ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. తాజాగా ట్రంప్ సుంకాల అమలను మూడునెలలు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ క్రమంలో మార్కెట్లలో సందడి కనిపించింది. దాదాపు మూడురోజుల తర్వాత మంగళవారం మార్కెట్లు మొదటి నుంచి చివరకు వరకు లాభాల్లో ట్రేడయ్యాయి. చాలారోజుల తర్వాత సెన్సెక్స్ మళ్లీ 76వేల మార్క్‌ని దాటింది. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 75,157.26 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది.మార్కెట్ మొదలైన ప్రారంభమైన కొద్దిసేపట్లోనే సెన్సెక్స్ దాదాపు 1600 వరకు పెరిగింది. ఇంట్రాడేలో 76,435.07 పాయింట్ల కనిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్.. గరిష్ఠంగా 76,907.63 పాయింట్ల వరకు చేరింది. చివరకు 1,577.63 పాయింట్ల లాభంతో 76,734.89 వద్ద స్థిరపడింది. ఇక నిఫ్టీ 500 పాయింట్లు పెరిగి 23,328.55 వద్ద ముగిసింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఒక్కొక్కటి మూడు శాతం పెరిగాయి. రియల్టీ ఇండెక్స్ ఐదుశాతానికిపైగా పెరగడంతో అన్ని రంగాల సూచీలు లాభాల్లో ముగిశాయి. ఇండస్‌ఇండ్ బ్యాంక్, శ్రీరామ్ ఫైనాన్స్, ఎల్‌అండ్‌టీ, టాటా మోటార్స్, యాక్సిస్ బ్యాంక్ నిఫ్టీలో భారీగా లాభాలను ఆర్జించగా.. హెచ్‌యూఎల్, ఐటీసీ నష్టపోయాయి.

## మళ్లీ షాక్ ఇచ్చిన బంగారం.. ఈ సారి ఎంత పెరిగిందంటే..?



**హైదరాబాద్ ఏప్రిల్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్):** పసిడి ధరలు కొనుగోలుదారులకు మరోసారి షాక్ ఇచ్చాయి. దేశ రాజధాని ఢిల్లీలో మరోసారి పెరిగింది. రూ.50 పెరిగి.. పది గ్రాముల బంగారం ధర రూ.96,450కి చేరిందని ఆల్ ఇండియా సరాఫా పేర్కొంది. మరో వైపు 99.5 శాతం ప్యూరిటీ గోల్డ్ రూ.50 పెరగడంతో ధర రూ.96వేలకు చేరి ఆల్‌టైమ్ గరిష్ఠానికి చేరింది. ఇక వెండి ధరలు రూ.2,500 పెరిగి కిలోకు రూ.97,500కి చేరింది. స్పాట్ బంగారం ధరలు ఔన్సుకు 13.67 డాలర్లు పెరిగి 3,224.60 డాలర్లకు చేరింది. జూన్ డెలివరీకి సంబంధించిన కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ 0.47 శాతం పెరిగి ఔన్సుకు 3,241.50 డాలర్లకు పెరిగింది. అబాన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చింతన్ మెహతా మాట్లాడుతూ.. డాలర్ బలహీనపడడం, యూఎస్ వాణిజ్య విధానంలో అనిశ్చితి నేపథ్యంలో బంగారం ధర స్థిరంగా ఉందన్నారు.బుధవారం యూఎస్ ఫెడరల్ రిజర్వ్ ఛైర్మన్ జెరోమ్ పావెల్ నిర్వహించనున్న విలేకరుల సమావేశంపై అందరి దృష్టి ఉందన్నారు. వాణిజ్య ఉద్రిక్తతలు పెరిగిన.. ఆర్థిక పరిస్థితి బలహీన పడిన నేపథ్యంలో సెంట్రల్ బ్యాంకు ఎలా స్పందిస్తుందో తెలుసుకోవాలని పెట్టుబడిదారులు కోరుకుంటారు. ఆసియా మార్కెట్‌లో స్పాట్ వెండి స్వల్పంగా ఔన్సుకు 32.32కి పడిపోయింది. హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ కమోడిటీ అనలిస్ట్ సౌమిల్ మాట్లాడుతూ మంగళవారం విడుదల కానున్న ఎన్‌వై ఎంపైర్ స్టేట్ మాన్యుఫ్యాక్చరింగ్ ఇండెక్స్‌తో సహా యూఎస్ మైక్రో డేటాపై పెట్టుబడిదారులు దృష్టి పెట్టారన్నారు. ప్రధానంగా టారిఫ్ సంబంధిత ముఖ్యాంశాలపై పెట్టుబడిదారులు దృష్టి పెడ్తారని.. ఇది బులియన్ ధరలను ప్రభావితం చేస్తుందని సౌమిల్ గాంధీ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. ఇక 22 క్యారెట్ల గోల్డ్ హైదరాబాద్‌లో రూ.87,200 పలుకుతుండగా.. 24 క్యారెట్ల పసిడి రూ.95,180కి చేరింది. కిలో వెండి రూ.1.09లక్షలు పలుకుతున్నది

## అదిరే ఫీచర్లతో గ్రాండ్ విటారా నయా వెర్షన్.. ధర ఎంతో తెలిస్తే షాక్

**న్యూఢిల్లీ ఏప్రిల్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్):** 2025 గ్రాండ్ విటారా భారతదేశంలో ఇటీవల లాంచ్ చేశారు. ఈ కారు ప్రారంభ ధర రూ. 11.42 లక్షలు (ఎక్స్-షోరూమ్). ఈ కొత్త మోడల్ మెరుగైన ప్రామాణిక భద్రతా ఫీచర్లతో పాటు అధునాతన ఫీచర్లతో ఆకట్టుకుంటుందిగ్రాండ్ విటారా తాజా అప్‌డేట్ ఇటీవల టయోటా చేసిన అర్బన్ క్రూయిజర్ హైరైడర్‌కు చేసిన అప్‌డేట్‌లకు అనుగుణంగా చేశారని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.ముఖ్యంగా మారుతీ సుజుకీ గ్రాండ్ విటారా 2025 అప్‌డేట్‌లో ఆరు ఎయిర్‌బ్యాగ్‌లతో భద్రతకు ప్రయాణికుల తగిన ప్రాధాన్యం ఇచ్చారు. ఈ కాంపాక్ట్ ఎస్‌యూవీలో




ఇప్పటికే అందుబాటులో ఉన్న భద్రతా కిట్ల జాబితాకు యాడ్ చేశారు. వీటిలో ఈఎస్‌పీ, హిల్-అసిస్ట్, డిస్క్ బ్రేక్లు, ఈబీడీ, ఐఎస్ఓ ఫిక్స్ ఉన్నాయి.2025 మారుతి సుజుకి గ్రాండ్ విటారా కారను కొత్త డెల్టా ప్లస్ స్ట్రాంగ్ హైబ్రిడ్ వేరియంట్‌ను ప్రవేశపెట్టింది. ఈ వేరియంట్ ధర రూ. 16.99 లక్షలు (ఎక్స్-షోరూమ్). ఇవి ఎస్‌యూవీకు సంబంధించిన జీటాం, ఆల్ఫాం, జీటాం (ఓ), ఆల్ఫాం (ఓ) స్ట్రాంగ్ హైబ్రిడ్ లైనప్‌లో చేరాయి.మారుతి సుజుకి గ్రాండ్ విటారా నయా వేరియంట్లలో సన్రూఫ్ ఇప్పుడు అందుబాటులో ఉంది. ఈ అప్‌డేట్‌తో వచ్చిన ఇతర లక్షణాలను పరిగణలోకి తీసుకుంటే 8 వే పవర్ అడ్జస్టబుల్ డ్రైవర్ సీటు, ఏటీ వేరియంట్లలో ఎలక్ట్రానిక్ పార్కింగ్ బ్రేక్, క్యాబిన్ ఎయిర్ ప్యూరిఫైయర్, ఎల్‌ఈడీ క్యాబిన్ ల్యాంప్‌లతో పాటు బ్యాక్ డోర్ సన్ షేడ్లు ఉన్నాయి.

# స్పోర్ట్స్

## చాహల్ మాయాజాలం.. కోల్‌కతాపై పంజాబ్ థ్రిల్లింగ్ విజయం

**హైదరాబాద్ ఏప్రిల్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఐపీఎల్ 18వ సీజన్‌లో భారీ స్కోర్ల మ్యాచ్‌లకు ఏమాత్రం తీసిపోని విధంగా లో స్కోరింగ్ గేమ్‌లోనూ ఉత్కంఠ రేకెత్తిస్తున్నాయి. ముల్లనూర్ వేదికా పంజాబ్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ మధ్య మ్యాచ్ థ్రిల్లర్‌ను తలపించింది. కొండంత స్కోర్ కొడుతుందనుకున్న పంజాబ్ 15.3 ఓవర్లకే కుప్పకూలగా.. హిట్టర్లతో నిండి కోల్‌కతా ఇన్నింగ్స్ 15.1 ఓవర్లకే ఆలౌట్ అయింది. 112 పరుగుల ఛేదనలో యజ్వేంద్ర చాహల్(4-28) విజృంభణతో అల్లాడిన డిఫెండింగ్



ఛాంపియన్‌ను ఆండ్రూ రస్సెల్(17) గెలిపించేందుకు సర్వశక్తులు ఒడ్డాడు. కానీ, యాన్సెన్ అతడిని బౌల్డ్ చేసి పంజాబ్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు.టీ20 క్రికెట్ అంటేనే సంచనాలకు నెలవు. అంచనాలు తలకిందులు కావడం అన్నది ఈ ఫార్మాట్‌లో మామూలే. ఐపీఎల్ 18వ సీజన్ అచ్చం అలానే సాగుతోంది. సన్‌రైజర్స్‌పై 245 రన్స్ కొట్టిన పంజాబ్ కింగ్స్.. సొంతగడ్డపై 111కే ఆలౌట్ అయింది. స్వల్ప లక్ష్యాన్ని అలవోకగా ఛేదిస్తుంది అనుకున్న కోల్‌కతా నైట్ రైడర్స్ అనూహ్యంగా 16 పరుగుల తేడాతో ఓడిపోయింది.

## 11ఏళ్ల రికార్డ్ బ్రేక్ చేసిన ధోనీ



**న్యూఢిల్లీ ఏప్రిల్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్):** 2025 ఐపీఎల్ లో చెన్నై సూపర్ కింగ్స్ మళ్లీ విజయం రుచి చూసింది. వరుసగా ఐదు ఓటముల తర్వాత, సోమవారం లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌పైతో జరిగిన మ్యాచ్ లో చెన్నై నెగ్గింది. లఖ్‌నవూ నిర్దేశించిన 167 పరుగుల టార్గెట్ ను చెన్నై 19.3 ఓవర్లలోనే 5వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఈ క్రమంలోనే సీఎస్కే కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ ఖాతాలో అరుదైన రికార్డు చేరింది. ఈ మ్యాచ్?లో 7వ స్థానంలో బ్యాటింగ్ కు దిగి ధనాధన్ ఇన్నింగ్స్?తో వింటేజ్ ధోనీని గుర్తుచేశాడు. 11 బంతుల్లోనే 26 పరుగులు (4 ఫోర్లు, 1 సిక్స్) తో ఔరా అనిపించాడు. అలా చెన్నై విజయంలో ధోనీ కీలక పాత్ర పోషించిన ధోనీకి 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డ్ లభించింది. ఈ క్రమంలోనే మహీ ఐపీఎల్‌లో 11 ఏళ్ల రికార్డును తిరగరాశాడు. ఐపీఎల్ చరిత్రలో 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు గెలుచుకున్న అతిపెద్ద వయస్కుడిగా రికార్డు సృష్టించాడు. సోమవారం మ్యాచ్? నాటికి ధోనీ వయసు 43 సంవత్సరాల 280 రోజులు. ఈ క్రమంలోనే మాజీ ప్లేయర్ ప్రవీణ్ తాంబే రికార్డును బ్రేక్ చేశాడు. అతడు 2014 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తూ, కోల్‌కతా నైట్‌రైడర్స్?పై మ్యాచ్?లో 42 సంవత్సరాల 208 రోజుల్లో 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డ్ గెలుచుకున్నాడు.కాగా, ఐపీఎల్?లో ధోనికి ఇది 18వ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు. 2175 రోజుల తర్వాత ధోనీ ఈ అవార్డు అందుకున్నునాడు. చివరిసారిగా ధోనీ 2019లో దిల్లీ క్యాపిటల్స్?తో మ్యాచ్?లో ఈ అవార్డు గెలుచుకున్నాడు

## భారత్- బంగ్లాదేశ్ మధ్య వన్డే సిరీస్

### షెడ్యూల్ ప్రకటించిన బీసీసీఐ

**న్యూఢిల్లీ ఏప్రిల్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్):** టీమ్‌ఇండియా ప్లేయర్లంతా ప్రస్తుతం ఐపీఎల్?లో బిజీగా ఉన్నారు. మరో నెల రోజుల పాటు ఫ్రాంచైజీ లీగ్?లోనే మన ఆటగాళ్లు ఉర్రూతలూగించనున్నారు. అయితే ఈ టోర్నమెంట్ తర్వాత భారత్ ఆయా దేశాలతో మూడు ఫార్మాట్ల క్రికెట్ ఆడాల్సి ఉంది. ఇందులో భాగంగానే ఆగస్టులో బంగ్లాదేశ్?లో పర్యటించనుంది. ఈ టూర్?లో వైట్ బాల్ సిరీస్ ఆడాల్సి ఉంది. ఈ నేపథ్యంలో బీసీసీఐ తాజాగా ఈ పర్యటన షెడ్యూల్ ప్రకటించింది. ఈ పర్యటనలో ఆతిథ్య బంగ్లాదేశ్?తో టీమ్‌ఇండియా వన్డే, టీ20 సిరీస్?ల్లో ఆడనుంది. కాగా, ఇరు దేశాల మధ్య సిరీస్ ఆగస్టు 17న ప్రారంభమై 31న ముగియనుంది. ఇందులో మూడు వన్డేలు, మూడు మ్యాచ్?ల టీ20 సిరీస్?లో భారత్ పోటీపడనుంది. అయితే ఇంగ్లాండ్ పర్యటన తర్వాత ఈ సిరీస్?లకు జట్లను ప్రకటించే అవకాశం ఉంది. అయితే ఐపీఎల్ ముగిసిన వెంటనే భారత్ జట్టు ఇంగ్లాండ్? పయనమవ్వనుంది. జూన్?లో ప్రారంభం కానున్న ఈ పర్యటనలో భారత్ 5 మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్ ఆగస్టు



4న ముగుస్తుంది. ఈ సిరీస్ తర్వాత టీమ్‌ఇండియా బంగ్లాదేశ్?లో పర్యటించనుంది. ఇదే ఏడాది అక్టోబర్?, నవంబర్, డిసెంబర్?లో టీమ్‌ఇండియా వరుసగా వెస్టిండీస్, సౌతాఫ్రికా జట్లతో మూడు ఫార్మట్ల సిరీస్?లో తలపడనుంది.

**భారత్- బంగ్లాదేశ్ వన్డే షెడ్యూల్**

తొలి వన్డే - ఆగస్టు 17 (మీర్పూర్)
రెండో వన్డే - ఆగస్టు 20 (మీర్పూర్)
మూడో వన్డే - ఆగస్టు 23 (చిట్టగాంగ్)

**భారత్- బంగ్లాదేశ్ టీ20 షెడ్యూల్**

తొలి టీ20 మ్యాచ్ - ఆగస్టు 26 (చిట్టగాంగ్)
రెండో టీ20 మ్యాచ్ - 29 ఆగస్టు (మీర్పూర్)
మూడో టీ20 మ్యాచ్ - ఆగస్టు 31 (మీర్పూర్)

భారత్- ఇంగ్లాండ్ టెస్టు షెడ్యూల్

తొలి టెస్టు- జూన్ 20 నుంచి 24 వరకు
రెండో టెస్టు- జులై 02 నుంచి -06 వరకు
మూడో టెస్టు- జులై 10 నుంచి- 14 వరకు
నాలుగో టెస్టు- జులై 23 నుంచి- 27 వరకు
ఐదో టెస్టు- జులై 31 నుంచి- ఆగస్టు 04 వరకు